# రెండు పెళ్ళు?

హైవే టెన్ మీద పెద్ద ఏక్సిడెంటు అయిందని, ట్రాఫిక్ ఆగిపోయిందని, రేడియోలో విన్న తర్వాత విక్రమరావ్, ఆఫీస్ నించి ఇంటికొస్తూ - కారుని హార్విన్ బులవార్డ్ మీదకు తప్పి, నెమ్మదిగా డ్రయివ్ చేస్తున్నాడు.

టైము సాయంత్రం ఆరు గంటలయింది. చలికాలం కనుక అప్పుడే బాగా చీకటిగా వుంది. ఆ రోజు సోమవారం అవటం వలన, ట్రాఫిక్ కూడా ఎక్కువగా వుంది.

మొన్న శనివారం మీనాక్షి ఆలయానికి వెళ్లినప్పుడు జరిగిన సంభాషణ హఠాత్తుగా గుర్తుకు వచ్చింది విక్రమరావ్‌కి -

★ ★ ★

హూస్టన్ నగరానికి దక్షిణంగా, పీర్‌లాండ్ అనే వూళ్లో, మనవాళ్లు అందరూ కలసి కట్టించినది మీనాక్షి దేవాలయం. పేరుకి మీనాక్షి దేవాలయమే అయినా, అక్కడ అందరు దేవుళ్లూ వున్నారు. ఊరు బయట కనుక, చక్కటి గాలితో, కాలుష్యం లేని వాతావరణంలో ఇండియాలోలాగా అందమైన గోపురం, మన సంప్రదాయాన్ని, సంస్కృతిని చాటుతూ వుంటుంది.



శనివారం అక్కడకు వెళ్లి, గుడి బయట విక్రమరావ్ ఆ చల్లటి గాలిని గుండెల నిండా పీలుస్తూ కూర్చున్నప్పుడు గోపాల్, పద్మనాభం వచ్చి ప్రక్కనే చేరారు.

మాటల సందర్భంలో అన్నాడు గోపాల్ - "మా అబ్బాయి అట్లాంటాలో పెళ్లి చేసు కుంటున్నాడు" అని -

విక్రమరావ్ అడిగాడు "మీరు చేస్తున్నారా - అతను చేసుకుంటున్నాడా?"

"అతనే చేసుకుంటున్నాడు - రాజు పనిచేసే హాస్పిటల్‌లోనే, ఆ అమ్మాయి కూడా డాక్టర్ - పేరు ట్రేసీ

మెక్కాయ్ - వారం రోజుల క్రితం ఫోన్ చేసి అన్ని అరేంజ్‌మెంట్లు కూడా పూర్తి అవుతున్నాయనీ, నన్నూ-మా ఆవిడ్నీ కూడా పెళ్లి రోజుకి వచ్చేయమనీ చెప్పాడు. వాడు ఆహ్వానం పంపాలనుకున్న నా స్నేహితుల అడ్రసులు కూడా అడిగాడు. మీ యిద్దరి అడ్రసులూ ఇచ్చాన్లెండి!" అన్నాడు గోపాల్.

"ఆ అమ్మాయిని మీరు చూశారా? - వాళ్ల తల్లిదండ్రులతో మాట్లాడారా?" అడిగాడు పద్మనాభం.

"ఆ అమ్మాయినా - ఫోటోలో చూశాను. మావాడు మెయిల్ చేశాడు! ఇవాళే అందింది!" అని ఏదో ఆలోచనలో పడిపోయాడు గోపాల్.

ఈలోగా గోపాల్ భార్య సులోచన, పద్మనాభం భార్య రేవతి, విక్రమరావ్ భార్య సునీత కూడా వచ్చారు అక్కడికి.

"ఇదిగో కనీసం ప్రసాదం అయినా తినండి - గుడికి వచ్చి కూడా భాతాఖానీ, రాజకీయాలు" అన్నది రేవతి, కొబ్బరిముక్కలు, అరటి పళ్లూ అక్కడ పెడుతూ -

సులోచన అన్నది - "మీరందరూ మా అబ్బాయి పెళ్లికి రావాలి. అట్లాంటాలో".

"అదే చెబుతున్నాను నేను కూడా" అన్నాడు గోపాల్.

సునీత అడిగింది - "ఆ అమ్మాయి అమెరికన్ అమ్మాయట కదా..."

సులోచన అన్నది - "అవును - ఇద్దరూ కలిసే పనిచేస్తున్నారు - వాడు ఇలాటిదేదో చేస్తాడని, మనసులో పీకుతున్నా, వాడు ఫోన్ చేసి చెప్పేసరికి - కొంచెం షాక్ తిన్నాం - బాగా ఆలోచించిన మీదట - నేను కొంచెం సరిపెట్టుకోగలుగుతున్నాను - కానీ..... ఆయనే...."

పద్మనాభం అడిగాడు - "ఏం గోపాల్.... నువ్వు ఇష్టపడటం లేదా?"

ఒక్క క్షణం గోపాల్ మాట్లాడలేదు - తర్వాత నెమ్మదిగా అన్నాడు - "నా ఇష్టంతో అవసరం వుందా? - వాడు ఇష్టపడ్డాడు. చేసుకుంటున్నాడు".


సులోచన అన్నది - "ఒక విధంగా అది మంచిదే - ఇండియాలో పుట్టి పెరిగిన అమ్మాయినో, ఇక్కడ పుట్టి పెరిగిన ఒక ఇండియన్ అమ్మాయినో, మనం యిష్టపడి పెళ్లి చేశామనుకోండి, వాళ్లు సుఖంగా వుంటారని ఏమిటి? వాళ్లకు నచ్చని పెళ్లి చేసి, వాళ్లని ఇబ్బంది పెట్టటం, మనకి బాగుంటుందా? అదేనా మనం కోరుకునే మన పిల్లల సుఖం. వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు - వాళ్ల కష్టసుఖాలు వాళ్లు చూసుకుంటారు. మనకి యిష్టమయితే, వెళ్లి నాలుగు అక్షింతలు వేద్దాం".

"అక్షింతలు వేయటానికి అది హిందూ వివాహం కాదు" అన్నాడు గోపాల్.

"పోనీ చర్చికి వెళ్లి చప్పట్లు కొట్టి రండి" అన్నది సులోచన - ఆవిడ కళ్లల్లో నీళ్లు,

సభ్యత కోసం, బయటికి రాకపోయినా, వున్నామని చెబుతూ మెదుస్తున్నాయి.

గోపాల్ అన్నాడు - "అది కాదు పద్మనాభం - నేనుకూడా పూర్వకాలపు ఛాందసుడ్ని కాదు, ప్రోగ్రెసివ్ పర్సన్ని. ముప్పయి ఏళ్ల క్రితమే ఇండియాలో, అందర్నీ ఎదిరించి, కట్నం లేకుండా, కుల ప్రసక్తి లేకుండా పెళ్లి చేసుకున్నాను. ఒక్క పిల్లాడు పుట్టగానే దేశ కాల పరిస్థితుల దృష్ట్యా, నా ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఆపరేషన్ చేయించుకున్నాను. అందరూ వద్దంటున్నా వినకుండా, పై చదువుల కోసం ఈ దేశం, బాంక్‌లో డబ్బు అప్పు తీసుకుని మరీ వచ్చాను. నేనూ మార్పు కోసం ఉత్సాహంగా ముందుకు వురికే మనిషినే! కానీ ఈ విషయంలో - వాడు ముందు చూపుతో ప్రవర్తించటంలేదనిపిస్తోంది!"



సులోచన అన్నది - "ఆ రోజుల్లో అవన్నీ చాల గొప్ప విషయాలు కావచ్చు. మీరు చాల ఆదర్శవాది కావచ్చు - కానీ అప్పటికీ, ఇప్పటికీ కాలం మారిపోలేదా? మనమూ మారాలి.... అంతే!"

గోపాల్ అన్నాడు - "కాలం మారటం కాదు... ఈ విషయంలో కల్చర్ కూడా మారింది - మనవాడు అమెరికన్‌ని పెళ్లి చేసుకున్నందువల్ల జరిగే ఫలితాలు ఆలోచించావా? - మనవేపు నుంచి చూస్తే - ఆ అమ్మాయీ, వాడూ ఇద్దరూ కలసి, మనవాళ్లతో కలసిపోవటం జరుగుతుందా? ఆ అమ్మాయి ఎంత మంచిదయినా అక్కడ - పరాయిగానే వుంటుంది. ఆ అమ్మాయి అసలు ఇండియాకి వాడితో వెళ్లి, మనవాళ్లని చూస్తుందంటావా? మన అమ్మా, నాన్నలకి మనమలతో ఆడుకోవాలనీ, కోడల్ని దగ్గరకు తీసుకుని అనురాగం చూపించాలనీ, ఆనందించా లనీ వుండదా - అవన్నీ జరుగుతాయంటావా?; అసలు ఇంగ్లీష్ మాట్లాడటమే రాని, మీ అమ్మకూ, మా అమ్మకూ, ఆ అమ్మాయి ఏం అర్థం అవుతుంది? - ఏం సంతోషం తెచ్చి పెడుతుంది? వాళ్ళ పిల్లలకు అటు ఆ సంస్కృతి, ఇటు ఈ సంస్కృతి కాకుండా, రెంటికీ చెడ్డ రేవడులు కారూ - పోనీ ఆ అమ్మాయి వేపు నించి చూస్తే, మనవడ్నీ, పిల్లల్నీ - వాళ్ళ వాళ్ళ, చుట్టాలు, స్నేహితులూ ఎంత గౌరవిస్తారు? వీళ్లు వాళ్లల్లో కలసిపోతారా? ఏ మతాన్ని పాటిస్తారు? మనవాడు చర్చికి వెడతాడా? - ఆ పిల్ల ఈ మీనాక్షి గుడికి వచ్చి, అర్చన చేయిస్తుందా? ఈ శాఖాహారపు వెధవ, వాళ్ళింట్లో ఏం తిండి తింటాడు? - ఇవన్నీ ఆలోచించకుండా - పెళ్ళి - పెళ్ళి - అంటే సరిపోదు -" గోపాల్ ఆవేశం చూస్తుంటే, ఆగస్టులో ఆంధ్రదేశంలో వచ్చే తుఫాను గుర్తుకు వస్తున్నది.

పద్మనాభం అన్నాడు - "అవన్నీ సమస్యలే కానీ, మనసుపడి పెళ్ళి చేసుకుంటున్న వాళ్ళు, వాటికి పరిష్కారాలు ఆలోచించకుండా వుండరు. అందులోనూ ఇద్దరూ బాగా చదువు కుని, రోజూ అనేక రకాల మనుష్యులతో వ్యవహరించే తెలివిగల డాక్టర్లు. వాళ్లకిలాటి క్లిష్ట పరిస్థితులలో నించి బయటపడటం వృత్తిరీత్యా సహజమే, అలవాటే! కాబట్టి మీరేమీ భయపడ నవసరం లేదు-".

"నీదాకా వస్తే కానీ, తెలీదు పద్మనాభం" అన్నాడు గోపాల్, ఒక కొబ్బరిముక్క నోట్లో వేసుకుని.

రేవతి - "మాదాకా ఏనాడో వచ్చింది గోపాల్, కాకపోతే ఇంకొక రూపంలో - మా అమ్మాయి సంధ్య మాకొక గుదిబండ అయి కూర్చుంది!"

"అదెలా...?" అడిగింది సులోచన.

"మా సంధ్యకు - ఒకవిధమైన రెబిలియన్ మెంటాలిటీ అలవాటయింది. నేను చీర కట్టుకుని బయటకు వస్తే దానికి చిన్నతనం, నేను బొట్టు పెట్టుకుంటే దానికి కోపం! నేను ఇంట్లో ఎన్ని చక్కటి మన వంటలు చేసినా తినదు. "రోజూ రైసేనా" అంటుంది. వారానికి ఒకసారి మాత్రమే అన్నం తింటుంది. మిగతా రోజుల్లో సాలాడ్, మేకరోని, గ్రిల్డ్ ఛీజ్, శాండ్‌విచ్,

నాచోస్, బర్రీటోస్, స్పెగటీ.... ఇలా ఏదో తింటుంది కానీ, ఇండియన్ ఫుడ్ ముట్టుకోదు. మాతో ఇండియన్ పార్టీలకు రాదు. స్టుపిడ్ ఇండియన్ పార్టీస్ అంటుంది. తెలుగు ఏదో కొంచెం వచ్చినా, మరచిపోవటానికే ప్రయత్నం చేస్తుంది. మేము తెలుగులో మాట్లాడితే, అర్థం కానట్లు నటిస్తుంది. ఇండియా నించి ఫోన్ కాల్ కబుర్లు కానీ, ఉత్తరాల్లోని కబుర్లు కానీ చెబుతుంటే, అక్కడినించి వెళ్ళిపోతుంది. వెరీ ఇండిఫరెంట్! తన అమెరికన్ ఫ్రెండ్స్‌తో మాత్రం గంటల తరబడి ఫోన్‌లో, నవ్వుతూ మాట్లాడుతుంది. మాతో మాత్రం కట్ అండ్ డ్రై. ఏమిటో నాకు మాత్రం అర్థం కావటం లేదు. పిల్లలకీ, మనకీ దూరం ఎక్కువయి పోతున్నది" - బుగ్గల మీది నీటి బిందువులను తుడుచుకుంటూ రేవతి - "చినుకులు పడుతున్నట్టు న్నాయి?" అన్నది. చినుకులు పడటం లేదని, రేవతికే కాదు, అక్కడవున్న అందరికీ తెలుసు.

"అవును - పడుతున్నట్టున్నాయి" అన్నాడు విక్రమరావ్, పైకి చూస్తూ రేవతి మాటకు గౌరవం యిస్తూ,

రేవతితో లాలనగా అన్నాడు పద్మనాభం ... "ఏదో చిన్నపిల్ల - పెద్దయితే, అన్నీ దానికే అర్థం అవుతాయి. నీకంటే గొప్పగా తయారవుతుంది!"

రేవతి అన్నది - "అది చిన్నపిల్ల ఏమిటి? - పదహారేళ్లు దాటితే - దాని బుద్ధి మారు తుందని అనుకోను నేను".

సునీత అన్నది - "ఎదిగే పిల్లల్లో, మార్పు చాల త్వరగా వస్తుంది రేవతీ. జస్ట్ డోంట్ గివప్. సమయం దొరికినప్పుడల్లా, ఉపన్యాసంలా కాకుండా, పాయింట్ బై పాయింట్ - నెమ్మదిగా చెబుతుంటే వాళ్లకే అర్థం అవుతుంది -"

"ఎప్పుడూ చెబుతూనే వుంటాను. చెప్పినకొద్దీ, ఆ తిరుగుబాటు ధోరణి ఎక్కువ అవుతుంది. అలా చెప్పిన తర్వాత నాలుగు రోజులు నాతో మాట్లాడదు. నాకు మాత్రం... మా అమ్మాయి మా ఇంట్లోనించి ఎప్పుడు బయటపడుతుందా - ఎప్పుడు మాకు మనశ్శాంతి వుంటుందా అనిపిస్తూంటుంది -"

సునీత రేవతిని వింతగా చూసింది, ఆ మాట ఆమె ఎంత ధైర్యంగా అన్నదా అని.

"ఏం గురూ - ప్రసాదం ఇంకా ఏమయినా మిగిలిందా...?" అంటూ వచ్చాడు ఆది నారాయణ.

"రా నువ్వే తక్కువయ్యావ్ - మా మీటింగ్‌లో...." అన్నాడు గోపాల్.

"నీకేంరా - అదృష్టవంతుడివి - మీ అబ్బాయి ఒక బంగారు కొండ. చెప్పినమాట వింటాడు -" అన్నాడు పద్మనాభం.

"సరే! నా సంగతే చెప్పాలా - మా బంగారుకొండ ఉద్యోగం చేయడానికి కాలిఫోర్నియా వెడతానంటున్నాడు - వాడికి టెక్సాస్ మీద విసుగు పుడుతున్నదిట - వేరే వుండాలని వాడి కోరిక -"

రేవతి అన్నది - "మీ అబ్బాయితో మాట్లాడుతున్నప్పుడల్లా, భలే ముచ్చటగా వుంటుందండీ ఆదినారాయణగారూ! ఇంగ్లీష్‌లో పలకరించినా (ఫోన్‌లో) నా గొంతు గుర్తుపట్టి, చక్కగా తెలుగులో మాట్లాడతాడు. 'మా అమ్మ ఉద్యోగానికి వెళ్లింది' అని తెలుగులో చెబుతాడు..."

"అంతేనా - మా నాన్న అంట్లు తోముతున్నాడు అని కూడా చెప్పాడా?" నవ్వాడు ఆదినారాయణ.

"నాతో చెప్పాడు చాలసార్లు... నువ్వు ఆఫీసుకి పోనప్పుడు, రెండు పనులు చేస్తుంటావని ఈ వూళ్లో. అందరికీ తెలుసు. ఇంట్లో వుంటే అంట్లు తోమటం, బట్టలుతకటం, ఇల్లు వూడవటం - అదే వాక్యూమింగ్‌లే - తోట పని చేయటం, బయటకు పోతే సాంస్కృతిక కార్యక్రమాలు, నాటకాలు, తెలుగు సినిమాలు, స్వరమాధురీ, సాహితీ సదస్సూ..."పద్మనాభం అన్నాడు.

సునీత అన్నది - "మీవాడు తెలుగులో మాట్లాడటమే కాదు - గిరిజగారు చెబుతుంటారుగా తెలుగులో, నెమ్మదిగా చదవగలడని. అంతేకాదు మేము మీ ఇంటికి వచ్చినప్పుడల్లా, చక్కగా ఆహ్వానిస్తాడు - మాట్లాడతాడు - మొత్తానికి మీరు బాగా పెంచారు మీవాడిని -".

ఆదినారాయణ నవ్వుతూ అన్నాడు - "మేమేం పెంచలేదు - వాడే పెరిగాడు. ఇవన్నీ మనం చెబితే వచ్చేవి కాదు సునీతా - వాళ్ల అభిరుచి, ఉత్సాహం, ఆఫ్‌కోర్స్ మన ప్రోత్సాహం దానికి తోడ్పడుతుందనుకో -"

"అయితే మీవాడు కాలిఫోర్నియా వెడుతున్నాడన్నమాట -"

"అవును శాంటాక్లారాలో ఇంటెల్‌లో చిప్ డిజైన్ ఇంజనీర్‌గా ఉద్యోగం వచ్చింది. ఇంకో వారంలో వెళ్లి అక్కడ జాయిన్ అవుతున్నాడు".

"మరి అక్కడ భోజనానికీ అదీ ఇబ్బంది అవుతుందేమో" అన్నది సులోచన.

ఆదినారాయణ నవ్వాడు - "మావాడికి కూరలు, పప్పు చేసుకోవటం నేర్పింది మా ఆవిడ. అదీకాక బయట ఏ రెస్టారెంటులో, ఏం బాగుంటుందో బాగా తెలుసు. మాకు ఆ విషయంలో ఏ మాత్రం వర్రీ లేదు -"

ఒక క్షణం ఆగి - ముందుకు వంగి నెమ్మదిగా అన్నాడు - ఆదినారాయణ, "ఇది విన్నారా - నార్త్ అమెరికాలోని రెండు తెలుగు సంఘాలు కలవటానికి ప్రయత్నాలు చేస్తున్నాయట-"

విక్రమరావ్, ఈసారి నిజంగా ఆకాశం వేపు చూసి - "అయితే వాన వచ్చే సూచనలున్నాయి!" అన్నాడు.

"ఏది మీరు చెప్పేది - మన రెండు 'గొడుగు' సంఘాలూనా" అడిగాడు పద్మనాభం.

దేశంలోని అన్ని తెలుగు అసోసియేషన్లనూ, దగ్గరకు తీసుకువచ్చి, వాళ్ల మధ్య కమ్యూనికేషన్‌ని పెంచి, ఇండియా నించి వచ్చిన కళాకారుల కార్యక్రమాలను క్రమబద్ధంగా నడిపించటం కోసం మొదలయిన సంస్థ. చాలా మంచి ఉద్దేశాలతో, చాలా చక్కటి కార్యక్రమాలను అందిస్తూ, తెలుగువారి ఐక్యత కోసం పాటుపడింది. తరువాత, తరువాత చౌకబారు కుతంత్ర నాయకులూ, కుల ముఖ్యమంత్రులు - ఆంధ్రదేశం నించి వచ్చి, ఇక్కడ నిప్పు లేకుండా పొగ సృష్టించి, తర్వాత నిప్పు ముట్టించి, ఆ అగ్నిలో ఆజ్యం పోసి, తెలుగువారి ఐక్యతను భంగం చేసి, కుల రాజకీయాలు సృష్టించి, వాళ్ల స్వలాభం వాళ్లు పొంది, రెండు చేతులా డబ్బు సంపాదించుకుని సుఖంగా వున్నారక్కడ. కానీ ఒక్క కుటుంబంలా వున్న ఇక్కడి సమాజంలో, మనస్పర్ధలు, అపార్థాలూ, విడిపోవటాలూ. ఆ మాటే విక్రమరావ్, సునీతతో అంటుంటే ఒకసారి వాళ్ల అబ్బాయి అడిగాడు - "ఆ పొలిటీషియన్‌లు అలవాటు ప్రకారం ఆ బుద్ధిలేని మాటలు చెప్పారనుకో, అవి విని విడిపోయిన వీళ్ల బుద్ధి, తెలివితేటలు ఏమయాయి?" అని. ఆ కుర్రాడికి పదేళ్ల వయసు. వాడికి వున్న వివేకం పెద్దవాళ్లకు లేదు మరి! అయినా ఈ రెండు తెలుగు సంఘాలూ మళ్లీ కలవటం అన్నది, ఇంత త్వరగా జరగటం చాలా గొప్ప విషయం. కాకపోతే, ఈ కులతృష్ణ, కుతంత్ర నాయకులు, వాళ్ల అనాగరిక రాజకీయాలను - మళ్లీ ఇక్కడకు తీసుకురాకుండా చూడటం, వాళ్ల నీడ మన మీద పడకుండా చూడటం అమెరికాలోని ప్రతి తెలుగువాడి బాధ్యత. ఈ ఐక్యత కోసం కష్టపడు తున్న వాళ్లు జాగ్రత్త పడవలసిన విషయం.

విక్రమరావ్ ఆలోచనలకు భంగం కలిగిస్తూ అన్నాడు ఆదినారాయణ - "పెద్దవాళ్లేమో, మీరా కులం, మేమీ కులం అని కొట్టుకుంటుంటే - వీళ్ల పిల్లలు - తెల్ల అమెరికన్లనూ, నల్ల అమెరికన్లనూ పెళ్లి చేసుకుంటున్నారు - అటు కులమూ పోయింది, తెలుగుతనమూ పోయింది, భారతీయతా పోయింది. అయినా ఇంకా ఈ కులాల మీద ఆరాటాలెందుకో - ఏనాటికి వీళ్లకి బుద్ధి వస్తుందో!"

★ ★ ★

ప్రక్కనించి, రెడ్‌లైట్ వున్నా విస్మరించి, దూసుకుపోతున్న ట్రక్‌ని చూసి, సడెన్‌గా కారు ఆపాడు విక్రమరావ్. అతని ఆలోచనలకు కూడా బ్రేక్ పడింది.

"నీ ఆలోచనలు ఆపి, రోడ్డు మీద ట్రాఫిక్‌ని చూస్తూ నడుపు" అన్నాడు ప్రక్క సీట్లోని బేతాళుడు.

విక్రమరావ్ ఆశ్చర్యంగా చూశాడు - "వారినీ - నువ్వెప్పుడు వచ్చావ్?"

"నేనా! నువ్వు - మొన్న మీనాక్షి గుడిలో జరిగిన విషయం ఆలోచించటం మొదలు పెట్టగానే వచ్చాను. నీ ఆలోచనల్ని వింటూ, చూస్తూ నీ ఆలోచనలకు భంగం కలగకుండా, నీ ప్రక్కనే కూర్చున్నాను. చాలా ఇంటరెస్టింగ్ టాపిక్ అది -"

"ఇంట్రెస్టింగ్ టాపిక్కే కాదు. ఇది నిజంగా ఇక్కడ జరుగుతున్న కథ - ఇక్కడ

జీవిస్తున్న భారతీయులందరూ, ఏదో ఒకనాడు, కాస్తో, కూస్తో ఈ కథలో జరిగే విషయాల్ని, అనుభవిస్తూనే వున్నారు'' విక్రమరావ్ అన్నాడు.

"సరే! ఈ అమెరికా బేతాళుడి కథలో నేను చాల ఆలస్యంగా ప్రవేశించాను. అయినా అన్నీ విన్నాను కనుక - నాకు కొన్ని ప్రశ్నలు ఉన్నాయి. వాటికి జవాబు చెప్పు - జవాబు తెలిసీ, చెప్పకపోతే...''

"నాకు తెలుసు ఏమవుతుందో - నీ ప్రశ్నలు అడుగు - ఇంటికి దగ్గరగా వచ్చేస్తు న్నాం'' - నవ్వాడు విక్రమరావ్.

బేతాళుడు అడిగాడు - "తల్లిదండ్రులు, ఎంత జాగ్రత్తగా వాళ్ల విలువలూ, సంస్కృతీ, భాషా నేర్పుతూ, ప్రేమగా పెంచుతున్న పిల్లల్లో, ఎందుకు ఈ మార్పు వస్తున్నది? రాజు ఆ అమెరికన్ అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడా? - సులోచనా, గోపాల్ ఆ విషయాన్ని ఎలా తీసుకుంటారు? సంధ్య అలా ప్రవర్తించటానికి కారణం ఏమిటి? రేవతి వాళ్ల అమ్మాయిని మార్చగలదా? ఆదినారాయణ వాళ్ల అబ్బాయి అంత చక్కగా ఎలా తయారయాడు? - ఈ రెండు తెలుగు సంఘాలూ కలుస్తాయంటావా? -''

పెద్దగా నవ్వాడు విక్రమరావ్ - "చాల ప్రశ్నలడిగావయ్యా - బేతాళుడూ! - కొంచెం ఆలోచించనీ -''

హార్విన్ రోడ్డు, హైవే సిక్సులో కలిసే చోట బాగా రష్ వుంటుంది ఎప్పుడూ. ప్రక్కనే వున్న షాపుల్లో నిండుగా వున్నారు జనం. అదే అమెరికన్ ఎకానమీ పెరగటానికి, జీవితస్థాయి ఎదగటానికీ కారణం.

విక్రమరావ్ అన్నాడు - "నేను ఇండియాలో వున్నప్పుడు, మా నాన్నగారు చెబుతుండే వారు. మా తాతయ్య ఎంత ఛాదస్తుడో, తను ఆయన చేసే పనులని ఎలా నిరసించేవాడో. కొన్నాళ్ల తర్వాత నాకు మా నాన్న చేస్తున్న పనులు ఛాందసంగా కనపడేవి. ఆయన్ని ఎదురుగా ఎదురించక పోయినా, ఆ భావాలు ఎంత విరుద్ధంగా వుండేవో బాగా తెలిసి వచ్చేది. అలాగే, మన భావాలు, మన పిల్లలకి ఛాందసంగా వుంటాయి. గోపాల్ ఆ రోజుల్లో కొత్త భావాలున్న మనిషి. కాని అతని భావాలు ఈనాటివి కావు. అందుకే వాళ్లబ్బాయి రాజు చేసే పనులు అతనికి నచ్చటం లేదు. తరాల అంతరాలు. రెండు తరాలు రెండు రకాలు. ఇది అమెరికా లోనూ, ఇండియాలోనూ, ఏ దేశంలోనయినా వుండేదే! - కానీ మనలాటి అమెరికా వచ్చిన భారతీయులకు ఇంకొక సమస్య.. అది సాంస్కృతిక పరమయినది. నాలోను, గోపాల్లోనూ, రేవతిలోనూ తొంభయి శాతం వున్నది భారతీయ సంస్కృతి. ఎందుకంటే అది బాగా అనుభ వించిన తర్వాతే మేము ఈ దేశానికి వచ్చాం. కాని రాజులోనూ, సంధ్యలోనూ వున్నది తొంభయి శాతం అమెరికన్ సంస్కృతి. మంచికో, చెడుకో, వాళ్లకి కులం - మతం తెలియదు. వాళ్లు కోరుకునే వాళ్లని దగ్గరకు తీసుకువచ్చే ఏ మతమయినా సమ్మతమే. ఈ రెండు

సంస్కృతులూ రెండు రకాలు. అందుకే ఈ వైరుధ్యం. తరాల అంతరాలతో పాటు సాంస్కృతికంగా చాల విభిన్న భావాలు. అంటే రెండు రెళ్లు నాలుగు కాదు. ఆరు కూడా కాదు - చాలా చాలా అన్నమాట. మనలాటి వాళ్లకి అర్థం కానంత. అర్థం అవుతున్నా కానట్టు నటించేంత. అంతటితో ఆగక, మన పిల్లల మనసులు మార్చటానికి ప్రయత్నం చేసేంత. ఆ ప్రయత్నం విఫలమయితే మీనాక్షి గుడి బయట, చల్లగాలికి కూర్చుని కన్నీళ్లు కార్చేంత....." ఆగాడు విక్రమరావ్. అతని గొంతులో ఒక విధమైన జీర.

బేతాళుడికి తెలుసు. తను మాట్లాడకుండా వుంటే విక్రమరావ్ ఆలోచనా స్రవంతికి భంగం కలగకుండా వుంటుందనీ, మిగతా ప్రశ్నలకి జవాబులు చెబుతాడనీ. కాసేపటికి తేరుకుని విక్రమరావ్ అన్నాడు.

"రాజు ట్రేసీని పెళ్లిచేసుకుంటాడు - గోపాల్ అతని పెళ్లికి రెండు రోజుల్లో ఒప్పుకుంటాడు - అట్లాంటాకి టిక్కెట్లు బుక్ చేస్తాడు. సులోచన గోపాల్ని, రాజునీ, ట్రేసీని ఒప్పించి, వాళ్ల పెళ్లి అట్లాంటాలో చర్చిలోనూ, ఈ మీనాక్షి గుడిలో హిందూమత బద్ధంగానూ జరిపిస్తుంది. ట్రేసీ గుళ్లో మంగళసూత్రం కట్టించుకుంటుంది. రాజు ఆమెకు, చర్చిలో ఉంగరం పెడతాడు. సంధ్య అన్నం తిన్నా, మేకరోనీ తిన్నా, ఆరోగ్యంగా వుంటే అంతే చాలు అనుకుంటోంది రేవతి. కారులో, సంధ్యతో ఒంటరిగా వున్నప్పుడు, మెల్లమెల్లగా భారతీయుల విలువల గురించీ, సంస్కృతి గురించీ మాట్లాడుతుంటాడు పద్మనాభం. ఆదినారాయణగారి బంగారుకొండ కాలిఫోర్నియాలో హాయిగానే వున్నాడనుకుంటారు ఆదినారాయణ - గిరిజా. ఎందుకంటే తన మనసులోని మాట, వాళ్ల బంగారుకొండ ఎప్పుడూ బయటకు చెప్పడు కనుక. అతను పెళ్లి చేసుకునేదాకా, ఎవరికీ తెలియదు - అతను అమెరికన్ను చేసుకుంటాడో, ఆఫ్రికన్నే చేసుకుంటాడో, ఇండియన్నే చేసుకుంటాడో. అమెరికాలోని రెండు తెలుగు అసోసియేషన్లూ కలిసే తరుణం వస్తున్నది - అంతేకాదు - మా ఇంటికి వచ్చేశాం - ఇంక నువ్వు ఎగిరి, నీ గూటికి నువ్వు వెళ్లటం మంచిది" అన్నాడు విక్రమరావ్ కారు ఇంటి దగ్గర ఆపుతూ.

బేతాళుడు, విక్రమరావ్ వేపు నవ్వుతూ చూసి, సలాం కొడుతున్నట్టు చేయి వూపి, పైన తిరుగుతున్న స్థానిక టెలివిజన్ కేంద్రం వారి హెలికాప్టర్ మీద ఎగిరి కూర్చున్నాడు.

❖